సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



ప్రాణం తీసిన ఈత సరదా

కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో ఈతకు దిగిన యువకుల్లో ఒకరు మృతిచెందగా మరొకరు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు(10గ్రాములు)	- రూ.62,090
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,546
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,712
నవర(8 గ్రా)	- రూ.45,696

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.8 /27.5

శుక్రవారం వాతావరణంలో 66 శాతం తేమ ఉంది. శనివారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

బత్తాయికి భలే ధర



సిట్రస్ ఫ్రూట్ అయిన బత్తాయికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా బత్తాయి జ్యూస్ తాగేందుకు మక్కువ చూపుతారు. ఈ సీజన్‌లో బత్తాయి కాయలకు మంచి ధర ఉండడంతో తోటలు సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ధర ఆశాజనకంగా ఉందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

విదేశాల్లో మంచి గిరాకీ

- ఉత్తరాది రాష్ట్రాలు, బెంగళూరు, చెన్నై మార్కెట్లకు ఎగుమతి
- జిల్లాలో 16 వేల హెక్టార్లలో సాగు
- 41 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- మంచి ధరలతో రైతులు సంతోషం



మార్కెట్‌లో బత్తాయి రాసులు

ఉదయగిరి: ఈ ఏడాది బత్తాయి తోటల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పంట లాభాదాయకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా కాయలు కోస్తున్నారు. దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో బత్తాయి సాగు అధికంగా ఉంటుంది. అందులో మన రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలైన అనంతపురం, వైఎస్సార్ జిల్లాలతోపాటు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో సాగు అధికంగా ఉంది. వేసవిలో బత్తాయి జ్యూస్‌కు డిమాండ్ ఉండడంతో మార్కెట్‌లో టన్ను రూ.35 వేల నుంచి రూ.40 వేల మధ్య ధర నిలకడగా కొనసాగుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహం

గత నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు మరలా బత్తాయి తోటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో బత్తాయి తోటలు 16 వేల హెక్టార్లలో సాగులో ఉన్నాయి. వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, సీతారామపురం మండలాల్లో 1,920 ఎకరాలు, వింజమూరు, కొండాపురం, కలిగిరి, జలదంకి మండలాల్లో 600 ఎకరాల్లో బత్తాయి తోటలు సాగులో ఉన్నాయి. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు బత్తాయి తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వడం, వివిధ రకాల ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో తోటలు వేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది 41 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

విదేశాలకు ఎగుమతి

ఈ ఏడాది జిల్లా నుంచి నాణ్యమైన బత్తాయి కాయలను అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరు, ఢిల్లీ మార్కెట్ల నుంచి నేపాల్, సింగపూర్, మలేసియా, బ్రిటన్, ఐర్లండ్, అమెరికా, అరబ్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మన ప్రాంతంలో పండిన బత్తాయి కాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు తోటల వద్దే కొనుగోలు చేస్తున్నారు. జిల్లా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు 70 శాతానికి పైగా కాయలు ఎగుమతి అవుతున్నాయి. కొంతమంది వ్యాపారులు చెన్నై, బెంగళూరు, హైదారాబాద్ మార్కెట్లలో అమ్మకాలు చేస్తూ మంచి లాభాలు పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

బత్తాయి సాగు విస్తీర్ణం - 16 వేల హెక్టార్లు	టన్ను ధర - రూ.35 వేల నుంచి రూ.40 వేలు

ఆశాజనకంగా ధరలు

ప్రస్తుతం రైతుల వద్ద నుంచి వ్యాపారులు టన్ను రూ.35 వేల నుంచి రూ.40 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో గత వారం రోజుల నుంచి క్రమేణా ధరలు పెరుగుతున్నాయి. ఈ సీజన్ ముగిసే నాటికి టన్ను రూ.70 వేల వరకు పలికే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది ఈ సీజన్‌లో టన్ను కాయలు రూ.25 వేలు మాత్రమే ఉందని, ఈ ఏడాది మంచి ధర ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వరికుంటపాడు మండలంలో సాగులో ఉన్న బత్తాయి తోట

ధరలు మరింత పెరిగే అవకాశం



ఈ సారి బత్తాయి పంట బాగుంది. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టన్ను రూ.35 వేల వరకు ఉంది. గతేడాది ఈ సీజన్‌లో కేవలం టన్ను ధర రూ.20 వేల నుంచి రూ.25 వేల మధ్య ఉండేది. ఎండల తీవ్రత పెరగడం, కాయలకు డిమాండ్ ఉండడంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

– గౌస్‌మొయిద్దీన్, రైతు, దాసరిపల్లి, ఉదయగిరి మండలం

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు



జిల్లాలో బత్తాయి సాగు మూడేళ్ల నుంచి క్రమేణా పెరుగుతోంది. గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ఈ ఏడాది 41,324 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఎకరా తోట సంరక్షణకు మూడేళ్లకు రూ.21 వేల చొప్పున ప్రభుత్వం రైతులకు ఇస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరాకు రూ.1.20 లక్షలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందజేస్తోంది. దరఖాస్తు చేసుకున్న 20 రోజుల లోపే రైతులకు డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తున్నాం.

– మద్దిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

మెరుగైన సేవలు అందించండి

- కలెక్టర్ హరినారాయణన్
- ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి తనిఖీ

ఆత్మకూరు: ప్రభుత్వ ఆస్పత్రులపై రోగులకు నమ్మకం పెరిగేలా వైద్యులు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగం, ఎక్స్‌రే యూనిట్, బ్లడ్ బ్యాంక్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కేంద్రం, బాలభవిత కేంద్రం, 3 ఆక్సిజన్ ప్లాంట్‌లను ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ద్వారా అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వలను పరిశీలించి ఏ మేరకు సరఫరా అవుతున్నాయో తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందించే సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులను ప్రేమతో పలకరించి వైద్యసేవలు అందించాలని డాక్టర్లు, సిబ్బందికి సూచించారు. ఆక్సిజన్ ప్లాంట్లలో ఒకటి మరమ్మతులకు గురికావడం వెంటనే పనులు పూర్తి చేయించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను తమ సొంత ఆస్తుల్లా కాపాడాల్సిన బాధ్యత ఉద్యోగులదేనని పేర్కొన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్ నాథ్, ఆర్‌ఎంఓ మునికుమార్, డాక్టర్ బాలాజీ, ఇతర వైద్యులు ఉన్నారు.



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

క్రెడాయ్ ప్రయత్నం అభినందనీయం



క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ మెగా ప్రాపర్టీ ఎక్స్‌పోను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల, పక్కన మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- అట్టహాసంగా క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

నెల్లూరు(బృందావనం): వినియోగదారుల సంక్షేమమే లక్ష్యంగా 'క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో'ను నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని శ్రీకస్తూరిదేవి గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని మంత్రి కాకాణి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రాపర్టీ ఎక్స్‌పోలో వివిధ ప్రాంతాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడికి అవసరమైన ప్రాపర్టీస్ ఎక్కడెక్కడ ఉన్నాయి.. ఎలాంటి నిర్మాణాలు అందుబాటులో ఉన్నాయి.. ఎక్కడ ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశాలు ఉన్నాయి.. బ్యాంకర్లు ఎలాంటి సహకారం అందిస్తారు.. తదితర అంశాలను తెలియజేస్తూ క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ ప్రెసిడెంట్ రామకృష్ణ తనతోపాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకుసాగడం సంతోషంగా ఉందన్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో ఈ కార్యక్రమాలు జరిగేవని, దీని ద్వారా ఎన్ని స్థలాలు, ఎన్ని భవనాలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ పొట్లూరి స్రవంతి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ తిరుపతి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ డీజీఎం(బీఅండ్‌ఓ) ఆర్.వరదరాజన్, క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ప్రెసిడెంట్ వైవీ రమణరావు, జనరల్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, ట్రెజరర్ పి.రాజశేఖర్‌రావు, క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ చైర్మన్ పీవీ రాఘవరావు, ప్రెసిడెంట్ డి.రామకృష్ణ, సెక్రటరీ టి.మధుసూదన, గ్రీవెన్స్ సెల్ చైర్మన్ డి.రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కనిపించిన 'నెలవంక'

- ఈద్ ఉల్ ఫిత్ర్ నేడు



బాణసంచా కాల్చి సంబరాలు చేస్తున్న ముస్లింలు

నెల్లూరు(బృందావనం): వినీలాకాశంలో శుక్రవారం నెలవంక దర్శనమిచ్చింది. నింగిలో 'నెలవంక' కనిపించిందంటూ ముస్లిం మతపెద్దలు ప్రకటించారు. పవిత్ర రంజాన్ (ఈద్–ఉల్–ఫిత్ర్) పండగను శనివారం జిల్లావ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు ముస్లింలు సమాయత్తమయ్యారు. నెల రోజులు పాటించిన ఉపవాస దీక్షలను శుక్రవారం నెలవంక దర్శనంతో విరమించారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ప్రజలకు అల్లా ఆశీస్సులు ఉండాలి

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని, ముస్లిం కుటుంబాలన్నీ సుఖ సంతోషాలతో రంజాన్ పండగ జరుపుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

నెల్లూరు ఇన్‌చార్జి రేంజర్‌గా మాల్యాద్రి



నెల్లూరు(బారకాసు): జిల్లా అటవీశాఖ పరిధిలోని నెల్లూరు రేంజ్‌కు ఇన్‌చార్జి రేంజర్‌గా సోమవరపు మాల్యాద్రిని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ శారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నెల్లూరు నగరంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న నెల్లూరు రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన సామాజిక అటవీ విభాగంలో డిప్యూటీ రేంజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతోపాటు ప్రస్తుతం ఇన్‌చార్జి నెల్లూరు రేంజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు నెల్లూరు రేంజర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన భాస్కర్‌రెడ్డిని బదిలీ చేస్తూ నాయుడుపేట అటవీ రేంజ్ అధికారిగా నియమించారు.

జిల్లా పరిషత్ అంటే గౌరవం లేదా?

- సమావేశానికి అధికారులు హాజరు కారా..?
- డీఎంహెచ్‌ఓపై జెడ్పీ చైర్‌పర్సన్ ఫైర్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సభ్యులంటే అధికారులకు కనీస గౌరవం లేదా.. ప్రొటోకాల్ పాటించరా.. ప్రారంభోత్సవాలకు, సమావేశాలకు ఆహ్వానించరా.. అంటూ జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన, జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆధ్వర్యంలో స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన రాపూరు ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. పీఎంఏజీవై అమలులో రాష్ట్రంలో జిల్లా రెండోస్థానంలో నిలవడం, దానికి సంబంధించి రూ.10 లక్షలు పారితోషికం మంజూరు కావడం గర్వకారణమని చైర్‌పర్సన్ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్పీ సమావేశాలకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేకుంటే ఫిర్యాదులు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ ఎస్‌ఈ, డీఎంహెచ్‌ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు విద్యుత్ ఎస్‌ఈ రాకపోవడంపై కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా మంచినీటిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. అనంతరం పంచాయతీరాజ్, పరిశ్రమల శాఖల అధికారులతో సమీక్షించారు. గోకులం, మినీ గోకులాలకు సంబంధించిన వివరాలను మే 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో డీఎంహెచ్‌ఓ సమావేశానికి హాజరు కాకపోవడంపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ సమావేశమంటే డీఎంహెచ్‌ఓ రారని, ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లాలో రూ.250.76 కోట్లతో 659 గ్రామ సచివాలయ భవనాలు మంజూరు చేశారని, ఇప్పటివరకు 301 భవనాలు పూర్తి కాగా 328 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన రోడ్ల పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని తెలిపారు. రాపూరు ఎంపీపీ ప్రసన్న కార్యాలయంలో రెస్ట్‌రూమ్ వినియోగించుకోనివ్వకుండా తాళాలు వేశారంటూ జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాగిజావ బదులు చిక్కీలు

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు రాగి జావ బదులు చిక్కీలు ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సోమ, బుధ, శుక్రవారాల్లో చిక్కీలు, మంగళ, గురు, శనివారాల్లో రాగి జావను అందిస్తున్నారు. అయితే మధ్యాహ్నం వరకే పాఠశాలలు ఉండడంతో మంగళ, గురు, శనివారాల్లో కూడా చిక్కీలు అందజేయాలని నిర్ణయించారు. ఈ మెనూను జిల్లా విద్యాశాఖ అమలు చేస్తుంది.

మళ్లీ దర్గా పీఠాధిపతిగా..

అనుమసముద్రంపేట: గతంలో ఓ వివాదాస్పద కేసులో చిక్కుకున్న ఏఎస్‌పేట దర్గా పీఠాధిపతి హాఫీజ్‌పాషా ఎట్టకేలకు శుక్రవారం ముతవళిగా బాధ్యతలు స్వీకరించారు. హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ విషయం వక్ఫ్‌బోర్డు అధికారులకు తెలపకపోవడంతో ఈఓ హుస్సేన్ దర్గా పీఠాధిపతి కుమారుడు జునైద్ పాషా ప్రార్థన చేసే సమయంలో అడ్డుకోవడంతో కొద్దిసేపు దర్గా ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ముతవళి హాఫీజ్ పాషా వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పీఠాధిపతిగా బాధ్యతలు చేపడుతున్నట్లు ఇందుకు సంబంధించిన అనుమతి పత్రాన్ని ఈఓకు అందజేశారు.

క్లుప్తంగా

బావిలో పడి మహిళ మృతి

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి బీసీకాలనీకి చెందిన షేక్ ఖాదర్‌బీ(35) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బీసీకాలనీకి చెందిన ఖాదర్‌బీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్ద ఇంజక్షన్ వేయించుకునేందుకు గురువారం రాత్రి ఖాదర్‌బీ ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. ఆ సమయంలో గ్రామానికి, కాలనీకి మధ్య రహదారి పక్కనే ఉన్న నేలబావిలో ఆమె ప్రమాదవశాత్తు జారి పడిపోయింది. ఖాదర్‌బీ కనిపించకపోవడంతో ఆమె కుమార్తె, కాలనీవాసులు గాలించినా ఫలితం లేకపోయింది. బావిలోని ఖాదర్‌బీ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయం పోలీసులకు తెలపడంతో ఎస్సై ఎస్.ప్రభాకర్, ఏఎస్సై శ్రీనివాసులు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. ఖాదర్‌బీ భర్త ఆరేళ్ల క్రితం బెంగళూరుకు బేల్దారి పనుల నిమిత్తం వెళ్లి మృతిచెందాడు.

- టికెట్ కోసం నానా పాట్లు
- అద్దె అభిమానులకు పార్టీ కండువాలు

సోమిరెడ్డి జిమ్మిక్కులు



నెల్లూరు సిటీ నియోజకవర్గ ఓటర్లకు కండువాలు కప్పిన సోమిరెడ్డి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి దారుణంగా ఉంది. నియోజకవర్గ ఇన్‌చార్జి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గ్రాఫ్ పాతాళానికి పడిపోయింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ రావడంపై అనుమానాలు ఉండడంతో ఆయన సరికొత్త డ్రామాకు తెరతీశారు. పక్క పార్టీల నుంచి జనం టీడీపీలో చేరుతున్నట్లు చేయాలని మండల స్థాయిలోని ద్వితీయ శ్రేణి నాయకులపై ఒత్తిడి పెంచారు. వెంకటాచలం మండలంలో టీడీపీ నాయకుల మధ్య అంతర్గత పోరు కొనసాగుతోంది. ఆ పార్టీ నాయకులు సోమిరెడ్డి వద్ద మెప్పు పొందేందుకు బయట నియోజకవర్గాల నుంచి అద్దెకు అభిమానులను తీసుకువచ్చి వెంకటాచలం మండలానికి సంబంధించిన వ్యక్తులుగా పరిచయం చేసి కండువాలు కప్పి టీడీపీలో చేర్చుకుంటున్నారు. ఇటీవల వెంకటాచలం వడ్డిపాళెంకు చెందిన రాజేంద్ర ఆధ్వర్యంలో నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలకు చెందిన ఓటర్లను వెంకటాచలంలో కార్యక్రమం నిర్వహించి, టీడీపీలో వందల మంది చేరినట్లుగా సోమిరెడ్డి ప్రకటించుకున్నారు. తాజాగా శుక్రవారం ఉదయం వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయం వద్ద నానా హంగామా సృష్టించి ఎర్రగుంట గ్రామానికి చెందిన ముగ్గురిని టీడీపీలోకి చేర్చుకున్నారు. అయితే సోమిరెడ్డి 15 మందికి కండువాలు కప్పి 153 మంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో టీడీపీలోకి చేరినట్లు మైక్‌లో చెప్పడంతో సోమిరెడ్డితోపాటు ఉన్న టీడీపీ మండల నాయకులే అవాక్కయ్యారు. శుక్రవారం కండువాలు కప్పిన వారిలో ముగ్గురు మినహా మిగతా వ్యక్తులు సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఓటర్లని నిరూపించే దమ్ము సోమిరెడ్డికి ఉందా అని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసురుతున్నారు.

పార్టీలోనూ అదే పరిస్థితి

సర్వేపల్లిలో వరుస ఓటములతో కుంగిపోయిన సోమిరెడ్డికి పార్టీలో పరపతి తగ్గింది. ఇటీవల కోటంరెడ్డి బ్రదర్స్‌ను పార్టీలోకి రానివ్వవద్దని చంద్రబాబు వద్ద ఎంత చెప్పుకున్నా ఫలితం దక్కలేదు. చినబాబు వర్గం చక్రం తిప్పి గిరిధర్‌రెడ్డిని పార్టీలోకి చేర్పించింది. అలాగే కోటంరెడ్డి చేరిక రోజు కూడా సోమిరెడ్డికి పిలుపు లేదంటే పార్టీలో ఆయన పరిస్థితి ఏమిటో ఇట్టే తెలిసిపోతోంది. సర్వేపల్లిలో కూడా అభ్యర్థి కోసం చినబాబు వెతుకులాట చేస్తున్నాడనే ప్రచారం జోరుగా సాగుతోంది.

కాజ్‌వే నిర్మించి సీఎం జగన్‌తో ప్రారంభిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం, విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామాల మధ్య పెన్నానదిపై సబ్‌మెర్జిబుల్ కాజ్‌వే నిర్మిస్తామని, దానిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూరులో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాజ్‌వే నిర్మాణ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలుస్తోందని, రివర్స్ టెండరింగ్‌తో అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. దీనిపై కొందరు సెల్ఫీలు అంటూ పనికిమాలిన ప్రకటనలు చేశారని పరోక్షంగా టీడీపీ నాయకుడు దినేష్‌రెడ్డిని విమర్శించారు. అలాగే కొత్త కాలువ సెంటర్ నుంచి కుడితిపాళెం వరకు 19 కిలోమీటర్ల మేర రూ.5 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు తీసుకొచ్చామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

చంద్రబాబుకు కులపిచ్చి..

మార్కాపురంలో చంద్రబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారని, చంద్రబాబుకు ఉన్న కులపిచ్చి ఎవరికైనా ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్ని విమర్శలు చేసినా, ఆయన కుమారుడు లోకేశ్ పాదయాత్ర చేసినా ప్రయోజనం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు శాశ్వత ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే ఇందుకు కారణమని తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30



అల్లా ఆశీస్సులతో
అంతా మంచి జరగాలి



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రి కాకాణి, ఎంపీలు ఆదాల, వేమిరెడ్డి తదితరులు

- మంత్రి కాకాణి, ఎంపీలు ఆదాల, వేమిరెడ్డి ఆకాంక్ష

నెల్లూరు(సెంట్రల్): పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా అల్లా ఆశీస్సులతో అంతా మంచి జరగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక సీపీఆర్ కల్యాణ మండపంలో నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి కాకాణి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ముస్లిం కుటుంబం రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని తెలిపారు. ఎంపీ ఆదాల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు, మతపెద్దలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- కాలువలో మునిగి మృతిచెందిన యువకుడు



శ్రీకాంత్ మృతదేహాన్ని వెలుపలికి తీసుకొస్తున్న దృశ్యం

సంగం: కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్ద ఈతకు దిగిన యువకుల్లో ఒకరు మృతిచెందగా మరొకరు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటన సంగం వద్ద శుక్రవారం జరిగింది. సంగం మండలం గాంధీజనసంఘానికి చెందిన శ్రీకాంత్, కత్తి వేణు, దుర్గ, మురళి, సుమేష్, సుధీర్, విష్ణు, వేణు మూడు బైకులపై కనిగిరి రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటర్ వద్దకు వెళ్లి కాలువలో ఈతకు దిగారు. శ్రీకాంత్, వేణు, సుధీర్ లోతులోకి వెళ్లి మునిగిపోవడాన్ని గమనించిన మురళీ అనే యువకుడు సుధీర్‌ను పక్కకు లాగి రక్షించాడు. వేణు, శ్రీకాంత్‌ను బయటకు లాగాలని విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యాడు. ఎట్టకేలకు వేణు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నాడు. శ్రీకాంత్(23) గల్లంతయ్యాడు. ఎస్సై నాగార్జునరెడ్డి గజ ఈతగాళ్లతో గాలించి శ్రీకాంత్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతిచెందిన శ్రీకాంత్ వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన వాడు. రెండేళ్లుగా తన తాత, అమ్మమ్మల వద్ద గాంధీజనసంఘంలోనే ఉంటున్నాడు. బద్వేల్ నుంచి శ్రీకాంత్ తల్లి పెంచలమ్మ, తండ్రి వెంకటయ్య తమ బంధువులతో సంగం వచ్చి విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో

గుడ్లూరు: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుడ్లూరు-తెట్టు ప్రధాన రహదారిలో పోట్లూరు వద్ద శుక్రవారం జరిగింది. కావలి మండలం చెన్నాయపాళెం గ్రామానికి చెందిన మహిళా కూలీలు ఆటోలో కందుకూరు మండలం గోపాలంపురం గ్రామానికి పనుల నిమిత్తం వెళుతున్నారు. ఆటో పోట్లూరు దాటి నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చే సమయానికి కందుకూరు ఆర్టీసీ డిపో బస్సు కావలి నుంచి కందుకూరుకు వెళుతూ అక్కడ ఆపి జామకాయల బాక్సులు లోడ్ చేస్తుండగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ ఎం.వేణుకు తీవ్రగాయాలు కాగా ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. 108సిబ్బంది ఆటో డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

బైక్‌లు ఢీకొని బాలుడి దుర్మరణం

జలదంకి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఓ బాలుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని చోడవరం సమీపంలో మామిడి తోట వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు చోడవరానికి చెందిన నన్నూరి పురుషోత్తం కుమారుడు రాజ్‌కుమార్(16) చోడవరం నుంచి కొండాపురం మండలం కొమ్మికి వెళ్తున్నాడు. కొమ్మికి చెందిన కంచర్ల మాధవయ్యాచారి కొమ్మి నుంచి సొంత పనులనిమిత్తం కావలి వెళ్తున్నాడు. మామిడితోట సమీపంలోకి వచ్చేసరికి రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఇరువురినీ చికిత్సనిమిత్తం కావలికి తరలిస్తుండగా రాజ్‌కుమార్ మృతిచెందాడు. మాధవయ్యాచారిని కావలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. రాజ్‌కుమార్ మృతదేహానికి కావలి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. జలదంకి ఎస్సై వీరేంద్రబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 125
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 218
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 242
లేయర్ చికెన్	: 128

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	23	59,655
నిఫ్టీ	0	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)		
60,191	▼	425
బంగారం (22 క్యారట్)		
59,950	▼	423
వెండి (కేజీ)		
74,773	▼	646

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్, అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358-00
వరంగల్	360-00
రిటైల్ ధర	4.20

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.



హింద్ జింక్ లాభం క్షీణత


క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు

ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 – 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



సాక్షి స్పోర్ట్స్



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్‌ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్‌లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-ఓజస్ రెండో రౌండ్‌లో 159-157తో మరియా-గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్ నూర్‌ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్-భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3-5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్



ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6-4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6-4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.



కాన్వే



జడేజా

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే ఆదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక					
జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)

ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం: 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. బౌలింగ్: ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం: 1-87, 2-110, 3-122. బౌలింగ్: భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్‌రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్ మార్క్'లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?

సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.